# 108 కలశాలతో ఘనంగా కోటితలంబ్రాల దీక్ష

**రాయపోల్, మార్చి 16, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని రాంసాగర్‌గ్రామంలో కోటితలంబ్రాల దీక్ష కార్యక్రమాన్ని సోమవారం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భద్రాచల శ్రీసీతారాముల కళ్యాణానికి సమర్పించేందుకు గోటితలంబ్రాల కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు భద్రాచలం నుండి తీసుకొచ్చిన గోటితలంబ్రాలను హనుమాన్ దేవాలయం నుంచి రామాలయం వరకు 108కలశాలలో నింపి బాజాభజంత్రీలు, కాషాయ జెండాలతో గ్రామంలోని వీధుల గుండా భక్తిగీతాల మధ్య ర్యాలీగా తీసుకువచ్చారు. రామాలయంలో భక్తులు మూడు గంటలపాటు రామనామ స్మరణచేస్తూ, గోటితో వడ్లను ఒలిచి, తలంబ్రాలుగా మార్చి రామకోటి రామరాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# నందిని సిధారెడ్డిని వరించిన కేంద్ర సాహిత్య అవార్డు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన ప్రముఖ తెలుగు సాహితీవేత్త, కవి డా॥నందిని సిధారెడ్డికి ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ సోమవారం 24 భారతీయభాషలకు సంబంధించిన తన వార్షిక పురస్కారాలను ప్రకటించింది. సిద్దిపేట ప్రాంతానికి చెందిన ప్రజాకవి, రచయిత నందిని సిధారెడ్డి తన కవితాసంపుటి 'అనిమేష' రచనతో 2025 సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపికయ్యారు. 2020లో ఆయన రచించిన అనిమేష కవితాసంకలనానికి ఈ అవార్డు లభించింది. సాహితీవేత్తలు మధురాంతకం నరేంద్ర, డాక్టర్ ఎన్.గోపి, డా॥కోటేశ్వరరావులతో కూడిన జ్యూరీ ఈ అవార్డుకు తెలుగులో నందిని సిధారెడ్డిని ఎంపిక చేసింది. సాహిత్య అకాడమీ అవార్డుకు నందిని సిధారెడ్డి ఎంపికకావడంతో సిద్దిపేట ప్రాంతానికి చెందిన తోటి కవులు, కళాకారులు సంతోషం వ్యక్తంచేశారు.

# ట్రిపుల్ ఆర్ బాధితరైతులకు ప్రభుత్వ బాసట

**-జిల్లా కలెక్టర్ కె.హైమావతి**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**గజ్వేల్, మార్చి 16, ప్రభాతవార్త:**
రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధితరైతులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని, భూసేకరణకు రైతులు సహకరించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసి సముదాయంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి మాట్లాడుతూ, గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని జగదేవ్‌పూర్, చేబర్తి, అలిరాజపేట, పీర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో చర్చించారు. గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజినల్ రింగ్‌రోడ్డు వెళ్తున్నందున ఈప్రాంతం అభివృద్ధిచెందుతుందని, రైతులు భూమిని ఇవ్వడానికి ఒప్పుకోవడం శుభపరిణామమన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగంచేస్తున్న మీకు ప్రభుత్వం తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామన్నారు. భూమిని ఇవ్వడానికి రైతులు ముందుకురావాలని తెలిపారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం, అందరికి ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు**




అంగన్‌వాడీ చలో హైదరాబాద్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

**పటాన్‌చెరు, మార్చి 16, ప్రభాతవార్త:**
అంగన్‌వాడీ టీచర్లకు కనీసవేతనం రూ.18వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ సందర్భంగా ఇందిరాపార్కువద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయటంకోసం వెళుతున్న సిఐటియు నాయకులను, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను పటాన్‌చెరు పోలీస్‌లు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేదని మండిపడ్డారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారంకోసం ప్రశాంతంగా చలో హైదరాబాద్ కార్యక్రమ నిర్వహణ సందర్భంగా ఇలాంటి అక్రమ అరెస్టులుచేయడం సరైనపద్ధతి కాదన్నారు. ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నాకు పోలీసులు అనుమతి ఇచ్చినా, అరెస్టు చేయడం దారుణమన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు కనీసవేతనం 18వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ కోసం అనేక సెంటర్లు ఖాళీగా ఉన్నాయని, వెంటనే టీచర్లు, ఆయాల పోస్టులను భర్తీచేయాలని అన్నారు. అనేకమంది ఆయాలు రిటైర్మెంట్ అవుతున్నా, నేటికీ బెనిఫిట్స్ అందడంలేదని గుర్తుచేశారు. మార్చి 16 నుండి సగంపూట బడుల నిర్వహణ జరిగేలా ఉత్తర్వులు జారీచేయాలని, మే నెలలో అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వేసవిసెలవులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అక్రమ అరెస్టుల విషయంలో అనేక సందర్భాల్లో ఖండించిన విషయం రాష్ట్రప్రభుత్వం గుర్తుంచుకోవాలని, అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మంజుల, విజయలక్ష్మి, అనిత, రాణి, లక్ష్మి, గాయత్రి, అక్షద, కృష్ణవేణి, స్వరూప, మందాకిని తదితరులు పాల్గొన్నారు.

# విఓఎలపై వేధింపులు మానుకోవాలి

**-సిఐటియు నాయకుల డిమాండ్**



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్(విఓఎలు)కు కనీస వేతనం అమలుచేయాలని వారిపై జరుగుతున్న వేధింపులను తక్షణమే నిలిపివేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐకెపి, విఓఎలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపాలస్వామి, బాల్‌నర్సయ్య, రవికుమార్, కనకయ్య, కిష్టయ్య, మహేష్, యమున, పుష్పలత, జయదేవ, మహాలక్ష్మి, రాములు, సందీప్, స్వామి, స్వప్న, నాగలక్ష్మి, శంకర్, రేణుక, విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే భవననిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేటు బీమాకంపెనీలకు ఇచ్చిన జీవో నంబరు 12ను సవరించి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు నుంచే సంక్షేమపథకాలు అందించాలని డిమాండ్‌చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళనచేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు. అలాగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశావర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ కలెక్టర్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు.

# ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కిందికి వాలిన కరెంట్ తీగలు

**-భారీ వాహనాలకు ఇబ్బందులు**

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ మండలం పందిళ్ళ గ్రామంలోని ఎస్ఎస్1 ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు చాలా కిందికి వాలిపోవడంతో భారీ వాహనాలు తరచుగా వాటికి తగులుతున్నాయి. ముఖ్యంగా పొట్లపల్లి శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయానికి పూజాకార్యక్రమాలకు వచ్చే పెద్దవాహనాలు ఈమార్గంలో ప్రయాణించే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. తీగలు తక్కువ ఎత్తులో ఉండటంవల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈసమస్యను దృష్టిలో ఉంచుకుని విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి అక్కడ పెద్ద విద్యుత్‌స్తంభాలు ఏర్పాటుచేసి తీగలను పైకి ఎత్తాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



కిందికి వాలిన కరెంట్ తీగల ముందు ఆగిన భారీ వాహనం

# సిఎం పర్యటనకు సర్వం సిద్ధంచేసుకోవాలి

**-గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ అమలు, శుభ్రతను పాటించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**-జిల్లా కలెక్టర్ కె.హైమావతి**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ అమలు, శుభ్రతను పాటించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గురుకులాలు, ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనార్టీ సంక్షేమహాస్టళ్లలో తనిఖీలుచేసే సమయంలో మెనూ ప్రకారం నాణ్యతకలిగిన, ఇవ్వాల్సిన పరిమాణంలో విద్యార్థులకు ఆహారమందించడం, వంటగది స్టోర్‌రూమ్‌లలో సరైన పరిశుభ్రతను పాటించే విషయాలను గమనించడం జరుగుతుందన్నారు. ప్రతి రోజు మండలస్థాయి అధికారులు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్ చేస్తూ విద్యార్థులకు సరైన ఆహారం అందించేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లా అధికారులు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఇంతకుముందు బిసి వెల్ఫేర్ హాస్టల్ అపరిశుభ్రంగా ఉండడం గమనించానని తెలిపారు. అపరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోస్ట్ మెట్రిక్ బిసి బాలికల హాస్టల్ సంక్షేమ అధికారిని సస్పెండ్‌చేయాలని వాచ్‌మెన్, వంటమనిషిని విధుల్లోంచి తొలగించాలని జిల్లా బిసి సంక్షేమ అధికారిని ఆదేశించారు. అలాగే ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక 99రోజుల కార్యాచరణ కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొని ప్రతి రోజూ ఫోటోలతో సహా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. గ్యాస్ కృత్రిమ కొరత లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.

ఈనెల 22న సిఎం రేవంత్‌రెడ్డి నంగునూర్ మండలం నర్మెటలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీని, జిల్లాకేంద్రంలో జిల్లాజైలు ప్రారంభోత్సవం చేస్తారని కార్యక్రమాలకు అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. మిషన్ భగరథ నీటిని తాగేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# కొండెక్కిన కోడి.. భగ్గుమన్న గ్యాస్ బుడ్డి..

**-మాంసాహార ప్రియుల చేరువలో మీనం**
**-జోరందుకున్న చేపల విక్రయాలు**



కోళ్లు లేక వెలవెలబోతున్న కోళ్ల ఫారం

**పాపన్నపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
చికెన్ ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యుడు మాంసాహారం తినేందుకు వెనుకడుగు వేసే పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ఎండలతోపాటు కోళ్ళకు వైరస్ సోకడంతో, మృత్యువాత పడుతుండడంతో, దిగుమతి తగ్గడం మూలంగా చికెన్ ధరలు ఒక్కసారి కొండెక్కాయి. పాపన్నపేట మండలంలో సోమవారం డ్రెస్డ్ చికెన్‌ధర రూ.300కి చేరగా, స్కిన్‌లెస్ ధర రూ.350 వరకు పెరిగింది. ఇక నాటుకోడి అయితే రూ.700నుండి రూ.800 మధ్య పలుకుతుంది. దీంతో జనం మాంసాహారం కొనాలంటే జంకుతున్నారు.

ఒకవైపు పశ్చిమాసియా యుద్ధంతో గ్యాస్, నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరగగా, చికెన్ ధరలకు రెక్కలు రావడంతోపాటు వేసవి కాలం ప్రారంభం కావడం. శుభకార్యాలు, పెళ్ళిళ్ళ సీజన్ కావడంతో చికెన్‌కు డిమాండ్ ఒక్కసారిగా పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఒక వైపు ఎండల వేడికి, బర్డ్ ఫ్లూ వైరస్ బారినపడి కోళ్లు మృత్యువాత పడుతుండడంతో దిగుమతి గణనీయంగా పడిపోయింది. అంతేకాకుండా వైరస్ బారినపడడంతో పౌల్ట్రీరంగ సంస్థలు పౌల్ట్రీ రైతులకు చిక్స్ ఇవ్వకపోవడంతో కోళ్ళఫారంలు చిక్స్‌లేక వెలవెలబోతున్నాయి. దీంతో దిగుమతి లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తుంది. గతంతో పోలిస్తే చికెన్ ధరలు భగ్గుమంటున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఎప్పుడూ ఇంత చికెన్ ధరలు లేవని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇది ఇలాగే సాగితే చికెన్ ధరలు రూ.400 వరకు చేరవచ్చని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

**చేపలే ముద్దు... చికెన్ వద్దు...**
ఇక ప్రస్తుతం చేపల సీజన్ నడుస్తుండడంతో, చాలామంది చికెన్ తినడం మానేసి చేపలు కొనుగోలు చేయడానికి ఆసక్తిచూపుతున్నారు. గ్రామాలలోని చెరువులు, కుంటలలోని నీరు గణనీయంగా తగ్గుతుండటంతో నీటిలో ఉన్న చేపలు ఎండవేడికి మృత్యువాత పడుతుండడంతో మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళి చేపలనుపట్టి తీసుకుని మార్కెట్లకు తరలిస్తుండడంతో, దిగుమతి గణనీయంగా పెరగడంతో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో మాంసాహారప్రియులు చేపలవైపు మొగ్గుచూపుతున్నారు. చికెన్ ధరలతో పోలిస్తే చేపల ధర కిలో రూ.100నుండి రూ.150 వరకు మాత్రమే ఉండడంతో చేపల కొనుగోలుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

# స్వయం ఉపాధి పథకాలకై దరఖాస్తుల ఆహ్వానం

**-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్**

**మెదక్, మార్చి 16, ప్రభాతవార్త:**
మెదక్ స్వయం ఉపాధిపథకం దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లి. మెదక్ జిల్లాలో 2025-26 వార్షిక ప్రణాళిక అమలు చేయుటకు రూ.236.60లక్షలతో 249మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చేయటానికి నిర్ణయించడం జరిగినదని అన్నారు.

**రవాణారంగం:** ఈవి ద్విచక్రవాహనాలు యూనిట్ విలువ రూ.1.00లక్షకుగాను (119)యూనిట్లు, ఈవి ఆటో రిక్షాలు (ఎలక్ట్రిక్) వాహనాలు యూనిట్‌విలువ రూ.3.00లక్షలకుగాను (59)యూనిట్లు మెదక్ జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగినదన్నారు. **వ్యవసాయరంగం** పథకం క్రింద సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్‌విలువ రూ.3.00లక్షల నుండి రూ.7.00లక్షలకు (12)యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. **ట్రైనింగ్ ప్రోగ్రామ్:** స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ క్రింద (59)యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించడం జరిగినది.

పైన పేర్కొన్న అన్నిపథకాలకు రూ.1.00లక్షలోపు యూనిట్ విలువ వాటికి 90 సబ్సిడీ, రూ.1.00 నుండి రూ.2.00 లక్షలలోపు యూనిట్‌విలువ వాటికి 80 సబ్సిడీ. రూ.2.00 లక్షల నుండి రూ.4.00లక్షల వరకు యూనిట్ విలువ వాటికి 70 సబ్సిడీ, రూ.4.00లక్షల పైన ఉన్న యూనిట్‌విలువకు 60 సబ్సిడీ మించకుండా అందజేయబడును. చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న అభ్యర్థులు షెడ్యూల్డు కులాల కార్యాచరణ ప్రణాళిక ద్వారా ఆర్థికసహాయం పొందుటకు వెబ్‌సైట్‌లో లబ్దిదారులు తమ వివరాలు (ఆధార్‌కార్డు, ఆదాయం, రేషన్ కార్డ్, కులధృవీకరణ పత్రం, ఫోటో, సదరం సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్‌బుక్) నమోదు చేసుకోవాలని, వయస్సు జూలై 1 నాటికి 21 నుండి 50 సంవత్సరాల వరకు ఉండాలి. వ్యవసాయ పథకాలకు జూలై 1 నాటికి 21 60 సంవత్సరాలు స్వయం ఉపాధి కార్యక్రమాల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణాకార్యక్రమానికి 18నుండి 45 సంవత్సరాలు, వేతన ఉపాధి కార్యక్రమాలకు 18నుండి 35 సంవత్సరాలు, గత 5 సంవత్సరాల్లో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ది పొందిన కుటుంబాల వారు అనర్హులు. స్వయం ఉపాధి పథకాలకు గ్రామీణప్రాంతాల వారికి రూ.1.50లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2.00లక్షల వరకు ఆదాయం ఉన్న వారు అర్హులు అన్నారు. దరఖాస్తులు తేది: 24.03.2026 లోపు ఆన్‌లైన్లో దరఖాస్తుచేసి, హార్డ్‌కాపీలను పూర్తిచేసి సంబంధిత మండల పరిషత్తు అభివృద్ధి అధికారి/ మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో సమర్పించాలి. జిల్లా స్థాయి కమిటీ ద్వారా లబ్దిదారులను ఎంపికచేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

# క్రికెట్ లీగ్ విజేతలకు బహుమతులు అందజేత




విజేతలకు బహుమతులు అందజేస్తున్న నగేష్‌శెట్కార్

**నారాయణఖేడ్, మార్చి 16, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో గత వారం రోజులుగా నిర్వహించిన అవెన్యూ హెల్త్‌కేర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఐపిఎల్ తరహాలో ఆటగాళ్ల వేలం నిర్వహించి, ముందుగా పేర్లు నమోదుచేసుకున్న క్రికెట్ క్రీడాకారులతో మొత్తం 10జట్లు ఈటోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఈరోజు జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో బిఎస్ వీరశెట్టి టీం, ఇస్మాయిల్ టీంల మధ్య ఉత్కంఠభరిత పోటీ జరిగింది. ఈమ్యాచ్‌లో బిఎస్ వీరశెట్టి టీం విజయంసాధించింది. టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా జాన్సన్ ఎంపికై సైకిల్ బహుమతిని అందుకున్నారు. విజేతలైన బిఎస్‌వీరశెట్టిటీంకు రూ.50,000 నగదు, రన్నరప్ అయిన ఇస్మాయిల్ టీంకు రూ.25,000 నగదు బహుమతులను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్‌శెట్కార్, డిసిసి ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, గెలుపు ఓటములు సహజమని, ఓటమి కూడా భవిష్యత్తులోని గెలుపుకు నాంది అవుతుందని అన్నారు. ఈ టోర్నమెంట్‌కు బిఎస్ వీరశెట్టి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నారాయణ్‌యాదవ్, వెంకట్, మాణిక్‌పటేల్ పాల్గొన్నారు.

# గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**-మహిళ భుజం నుండి 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు**
**-ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ**

**గజ్వేల్ టౌన్, మార్చి 16, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఆర్థికస్తోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్‌స్థాయి వైద్యసేవలు అందిస్తూ ఆదర్శంగా నిలిచారు. గజ్వేల్‌పట్టణానికి చెందిన జ్యోతి (32) అనేమహిళ గతకొంతకాలంగా కుడిభుజంపై పెద్దకణితి(ట్యూమర్) సమస్యతో బాధపడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆమె ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకునే స్తోమత లేక గజ్వేల్ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. రోగి పరిస్థితిని గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. ఒక బృందంగా ఏర్పడిన వైద్యులు సుమారు 750గ్రాముల బరువున్న భారీ ట్యూమర్‌ను (నియోప్లాజమ్) విజయ వంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటుందని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యమని, శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడంవల్ల డిఎన్ఎలో మార్పులు, రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ఇటువంటి ట్యూమర్లు ఏర్పడతాయని తెలిపారు. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రతించి బయాప్సీ వంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయ వంతం చేసిన జనరల్ సర్జన్ డాక్టర్ ప్రేమ్‌కిషోర్, అనస్తీషియా నిపుణులు డాక్టర్ మహిపాల్, డాక్టర్ ఇస్రత్, ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్, స్టాఫ్ నర్సులు రాజు, పావని, ఆస్మాను సూపరింటెండెంట్ ప్రత్యేకంగా అభినందించారు. మెరుగైనవైద్యం అందించిన వైద్యబృందానికి రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

# చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి

**కొండపాక, మార్చి 16, ప్రభాతవార్త:**
చికిత్సపొందుతూ గీతకార్మికుడు మృతిచెందిన సంఘటన కొండపాక మండల పరిధిలోని గిరాయిపల్లిలో చోటుచేసుకుంది. 20రోజుల క్రితం అరిగెలా చంద్రయ్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుండి జారి కిందపడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు నిమ్స్అసుపత్రిలో చికిత్సచేయించారు. మృతుడు చికిత్సపొందుతూ, సోమవారం అసుపత్రిలో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

# కోళ్లఫారంను పరిశీలించిన పశువైద్య సిబ్బంది

**వార్తకు స్పందన**

**పాపన్నపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
వార్త పత్రికలో.. బర్డ్ ఫ్లో కలకలం.. అన్న శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా పశు వైద్యశాఖ ఎడి వెంకటయ్య స్పందించారు. మండల పరిధిలోని కొత్త లింగాయిపల్లి శివారులోని కలాలి ప్రవీణ్‌గౌడ్ కోళ్ళఫారంలో రోజుకు వెయ్యి చొప్పున కోళ్ళు మృత్యువాత పడ్డాయన్నది వాస్తవమని, ఇప్పుడు కోళ్ళు లేవని, కోళ్ళ పరీక్షలు నిర్వ హించకుండానే జిల్లా అధికారి కొక్కర వైరస్ సోకడం మూలంగా కోళ్ళు మృత్యువాత పడ్డాయని చెప్పడం కొసమెరుగు. క్షేత్రస్థాయి పర్యటన చేయ కుండానే తమ సిబ్బందిని పంపి కోళ్ళఫారం రైతులు చెప్పింది విని, కొక్కర వైరస్ అని చెప్పడం విడ్డూరంగా ఉంది.

## కంటోన్మెంట్‌లో రంజాన్ తోఫా గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీ



ముస్లిం మైనార్టీలకు తోఫా గిఫ్టలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,మార్చి 16 ప్రభాతవార్త:** రంజాన్ పండుగను పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గంలోని సిఖ్ విలేజ్,వెస్ట్ మారేడ్‌పల్లి,బొల్లారం,లాల్ బజార్ ప్రాంతాల్లోని మజీద్‌లలో ముస్లిం మైనార్లీకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ చేతుల మీదుగా రంజాన్ తోఫాను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు చింతల వేణుగోపాల్ రెడ్డి, బాల్‌రాజ్, ఇగ్బాల్, గఫర్‌ఖాన్,నవీన్,శ్రీనివాస్ గౌడ్,శంకర్,ఉత్తరయ్య పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



**అత్తాపూర్ మార్చి 17, ప్రభాతవార్త :**
పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పలువురు సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పార్టీ పిలుపుమేరకు రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని బుద్వేల్ చౌరస్తాలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి రాష్ట్ర నాయకులు పుస్తకాలు నర్సింగ్ రావు ,మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతూ.. ఇస్లామిక్ దేశమైన ఇరాన్ పై అమెరికా యుద్ధం చేస్తుంది ఆ కారణంతో క్రూడ్ ఆయిల్ ధరలు కొరత ఉందని గ్యాస్ ధరలు పెంచడం మోదీ ప్రభుత్వానికి అంత మంచిది కాదని మండిపడ్డారు.వెంటనే పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని అమెరికా, ఇజ్రాయిల్ ఉచ్చులో చిక్కుకోవద్దని భారతదేశ స్వరోభవత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పై ఉందని ఆ దిశగా పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జె ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ మండల ఏఐటీయూసీ కార్యదర్శి సయ్యద్ కాజా అధ్యక్షులు ఎండి సలీం మండల కార్యాలయం కార్యదర్శి జి సత్యం మండల కౌన్సిల్ సభ్యులు పాండు సదానంద గౌడ్ మోనిక కె వాణి పుష్ప శాలిని శాంతమ్మ ఎండి సాబీర్ ఇంద్ర మణెమ్మ జంగయ్య తదితరులు పాల్గొన్నారు

### పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

**-రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్**



**అత్తాపూర్ మార్చి 17, ప్రభాతవార్త :**
విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ పేర్కొన్నారు.సోమవారం రాంబాగ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శంకర్ రాథోడ్‌లతో కలిసి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులను ప్రశ్నించి వారి అభ్యాస స్థాయిలను పరిశీలించారు.పాఠశాలలో బోధన విధానం మరియు విద్యార్థుల అభ్యాస స్థాయిలపై ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో ఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వాటిని తక్షణమే సరిచేయాలని, అలాగే విద్యార్థుల అభ్యాస స్థాయిలను 15 రోజులలోపు మెరుగుపరచాలని ఆదేశించారు.పాఠశాలలో పరిశుభ్రత సరిగా నిర్వహించకపోవడం గమనించిన డైరెక్టర్ , స్కావెంజర్‌ను వెంటనే తొలగించి పాఠశాల పరిశుభ్రతను మెరుగుపరచాలని ఆదేశించారు.అదనంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల కోసం ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో ప్రతిపాదిత పాఠశాల స్థలాన్ని కూడా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధరలను నియంత్రించాలి : టిడిపి

**ముషీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** యుద్ధం పేరుతో పెంచిన వంటగ్యాస్ ధరలను తక్షణమే నియంత్రించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యుద్ధం సాకుతో కేంద్ర ప్రభుత్వం సామాన్యుడి పొయ్యిలో నిప్పులు పోస్తోందని ఆరోపించారు. ఒకప్పుడు సామాన్యుడికి అండగా ఉన్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం పేరుకే పరిమితం చేసిందని, అంతర్జాతీయ సంక్షోభం పేరుతో ఇప్పుడు అసలుకే ఎసరు పెడుతోందని విమర్శించారు. గ్యాస్ ధరల పెంపు కేవలం వంటింటికే పరిమితం కాదని, అది రవాణా ఖర్చులు, తద్వారా నిత్యావసర వస్తువుల ధరలు, హోటళ్ల తదితర అనేక అంశాలను ప్రభావితం చేస్తుందని గుర్తు చేశారు. తక్షణమే వంట గ్యాస్ ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శ్యాం సుందర్, తడక వినోద్ పాల్గొన్నారు.

### ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**ముషీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. సోమవారం నేషనల్ వ్యాక్సిన్‌డేను పురస్కరించుకుని ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో హెచ్‌పివి వ్యాక్సిన్ పట్ల విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఐబి అడిషనల్ జాయింట్ డైరెక్టర్ శృతి పాటిల్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.కే.చాందినిలు మాట్లాడుతూ దేశంలోని మహిళల్లో ఎక్కువ శాతం వచ్చే సర్వేకల్ క్యాన్సర్‌ను నివారించేందుకు 14ఏళ్ల లోపు ఉన్న 1.15 కోట్ల మంది బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ టీకాలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, ఈ వ్యాక్సిన్ వల్ల సర్వేకల్ క్యాన్సర్‌ను 90శాతం నివారించవచ్చునని పేర్కొన్నారు. ఈ సదస్సులో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ (సిబిసి) డిప్యూటీ డైరెక్టర్ కరీనా, అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారుల నిర్లక్ష్యంతో శివరాంపల్లి గ్రామంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయం పక్కన నుంచి శిశుమందిర్ పాఠశాల వైపు వెళ్లే రహదారిపై పేరుకుపోయిన చెత్త, నిర్మాణ వ్యర్థాలు మరియు మురుగు నీరు దృశ్యాలను చూపిస్తున్న బిజెపి నేత సామా రాహుల్ రెడ్డి

# అవినీతి మయంగా ఎడిఇ, ఎఇ కార్యాలయాలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

**కూకట్‌పల్లి మార్చి 16, ప్రభాతవార్త:** టీజీఎస్‌పిడిసిఎల్ విద్యుత్ కెపిహెచ్‌బి కాలనీ ఏడీఇ కార్యాలయంతో పాటు బాలాజీ నగర్, కెపిహెచ్‌బి కాలనీ ఏఇ కార్యాలయాలు అవినీతిమయంగా మారాయి. ఇక్కడ పెద్ద ఎత్తున ముడుపులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కమర్షియల్, బహుళ అంతస్తుల భవనాలతో పాటు వ్యక్తిగత గృహాల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతుండడంతో అదే రీతిన పెద్ద మొత్తంలో కొందరు అధికారులకు మామూళ్లు వస్తున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. విద్యుత్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చినప్పటికీ ఈ కార్యాలయాల్లో ఏమాత్రం మార్పు రాకపోగా అవినీతి మాత్రం మరింత పెరిగిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. ఎంత సేపు వ్యక్తిగత గృహాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన కొత్త కనెక్షన్ల మంజూరులో కొందరు అధికారులు లంచాలను దండుకుంటూ యమబిజీగా ఉంటూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడంలేదు. కెపిహెచ్‌బి కాలనీ, బాలాజీ నగర్ పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి జెట్ వేగంతో జరుగుతుంది. దీంతో విద్యుత్ కనెక్షన్లు ఏయేటికాయేడు పెరుగుతున్నాయి. పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే. పెరిగిన విద్యుత్ కనెక్షన్లను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తుడడంతో విద్యుత్ సమస్యలు అంతకంతకు పెరుగుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించకపోవడంతో గంటల కొద్దీ విద్యుత్ సరఫరాలో అంతరయాలు ఏర్పడుతున్నాయి. ఇక రాత్రి వేళల్లో కరెంట్ పోయిందంటే రాత్రి అంతా చీకట్లో ఉండాల్సిందే. కరెంట్ సరఫరాలో కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో వినియోగదారులు నిత్యం అనేక అవస్థలకు గురవుతున్నారు. వ్యాపార సముదాయాలకు ఓ విధంగా డొమెస్టిక్ వినియోగదారులకు మరో విధంగా సరఫరా చేస్తూ విద్యుత్ అధికారులు తమ ద్వంద్వనీతిని ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ సమస్యలు నెల కొంటే ఏఇలు, లైన్‌మెన్లు పట్టించుకోవడంలేదు. కొందరు అధికారులు ఆడింది ఆట పాడింది పాట అన్న చదంగా తయారైంది. అనేక ప్రాంతాల్లో కరెంట్ హై, లో ఓల్టేజీలతో కరెంట్ సరఫరా అవుతుండడంతో విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ఇంట్లోని టీవీలు, ల్యాప్‌ట్యాప్‌లు, కంప్యూటర్లు కాలిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారులు ఇవేవి పట్టించుకోవడంలేదు. అడిగినంత ముట్టచెబితే చాలు మీటర్లే కాదు ఎకంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మరు, ప్యానల్ బోర్డులను మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ బహుళంతస్తుల భవనాలు, విల్లాలుకు కొత్త కనెక్షన్లు, ప్యానల్ బోర్డులు, డీటీఆర్‌లు, లైన్ల మంజూరుకు కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వసూళ్ళకు పాల్పుడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.

## సమాజాన్ని అద్దంలో చూపించేవే హాస్యనాటికలు : సుద్దాల అశోక్‌తేజ



వీడేం మగాడండీ బాబూ హాస్యనాటికలో ఒక దృశ్యం

**నాంపల్లి, మార్చి 16 ప్రభాతవార్త :** హాస్యనాటికలు చైతన్యదీపికలు, సమాజాన్ని అద్దంలో చూపించే గొప్ప సాధనాలన్న ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ హాస్యంలో ఒక చిన్న అధిక్షేపం, చిన్న వ్యంగ్యం కలగలిస్తేనే అదొక జనప్రయోజనం గమ్యం సృజన కళాప్రభం జనం అనేదానికి దగ్గరగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. హాస్యనాటికల్లో మాటలు అందరికీ చాలా తేలికగా అర్థమై హృదయాల్లోకి సూటిగా వెళ్లిపోతాయని అన్నారు. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి వ్యావాహిక భాషా ఉద్యమం తీసుకొచ్చిన తర్వాతనే మాటలస్థాయి ప్రజలస్థాయికి వచ్చి అందరికీ అర్థమయ్యే రచనా విధానానికి మూలధాతువు హేతువు అయ్యారని గుర్తుచేశారు. కళావిపంచి, హైదరాబాద్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సభాధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన సుద్దాల అశోక్‌తేజ విశిష్ట అతిథులు సుబ్బరాయశర్మ, బి.ఎం.రెడ్డి, సమీర్, బొప్పన నరసింహారావు (బుజ్జి), డి.రామకోటేశ్వరరావు తదితరులతో కలిసి వల్లూరు శివప్రసాద్ సంపాదకుడుగా, గంగోత్రిసాయి సహసంపాదకత్వంలో రూపొందిన ఉత్తమ హాస్యనాటికలు పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రముఖ 50 హాస్య, వ్యంగ్య నాటికల సమాహారమే ఉత్తమ హాస్యనాటికలు పుస్తకమని అన్నారు. అనంతరం కళాంజలి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పి.టి.మాధవ్ రచన, జి.ఎస్.చలపతి దర్శకత్వంలో మగాడు అనిపించుకోవడం కోసం సృష్టించిన ఒక అందమైన అబద్ధమే నాటిక ప్రధానాంశంగా, చలపతి, శోభారాణి, రాధాకృష్ణ, సురేంద్ర నవీన్‌ల ఫన్ విత్ జోక్స్‌లతో రూపొందిన వీడేం మగాడండీ బాబూ హాస్యనాటిక ఆహుతులను కడుపుబ్బ నవ్వించి ఆనందలోకంలో విహరింపజేసింది.

## మూడవ డిస్కం ఏర్పాటు ప్రతిపాదన పునః పరిశీలించండి

**-తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల జెఏసి డిమాండ్**

**హైదరాబాద్,మార్చి 16,ప్రభాతవార్త:**



సిఎండికి వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు సాయిబాబు, రత్నాకర్‌రావు, శ్రీధర్, సదానందం తదితరులు

ప్రభుత్వం మూడవ డిస్కం ఏర్పాటు ప్రతిపాదన పున: పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం రైతు డిస్కం (మూడవ డిస్కం) ఏర్పాటు ప్రతిపాదన దాని పరిణామాలపై మింట్ కాంపౌండ్‌లోని జేఏసీ కార్యాలయంలో చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్‌రావు, సెక్రటరీ జనరల్ శ్రీధర్‌ల ఆధ్వర్యంలోని ప్రతినిధులు కులం కుశంగా చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ డిస్కం ప్రతిపాదనను పునః పరిశీలించాలని ప్రభుత్వం టిజిజెన్‌కో, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండిలను కోరినట్లు తెలిపారు. విద్యుత్‌రంగం మెరుగుపడటం కోసం ఉద్దేశించిన సవరణలకు జెఏసీ వ్యతిరేకం కాదని కానీ చేపట్టబోయే సంస్కరణలు విద్యుత్ చట్టం-2023 నిబంధనలకు, విద్యుత్ నియంత్రణ కమిషన్, విద్యుత్ అప్పిలైట్ ట్రిబ్యునల్ చట్టాలకు అనుగుణంగా ఉండాలని కోరారు. అదే విధంగా ఆర్థిక స్థిరత్వం, వినియోదారులకు మెరుగైన సేవలు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడే విధంగా ఉండాలన్నారు. ముఖ్యంగా క్రాస్‌సబ్సిడీ, టారిఫ్ సూత్రాలు, ఆర్థిక స్థిరత్వం, సెక్షన్ 65 ప్రకారం ముందస్తు సబ్సిడీ, సెక్షన్ 43 ప్రకారం యూనివర్సల్ సర్వీస్ బాధ్యత, ప్రస్తుత డిస్కంల ప్రైవేటీకరణ, జెన్కోలకు చెల్లించవలసిన బకాయిలు, ఎనర్జీ అకౌంటింగ్, మీటరింగ్, సెటిల్‌మెంట్, విద్యుత్ కొనుగోలు ఖర్చుల కేటాయింపు,నష్ట ప్రమాణాలు,కార్యకలాప నియంత్రణ, అత్యవసర స్పందన, ఉద్యోగుల ట్రూఅప్ ఖర్చుల వసూలుపై సిఎండిలో చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్టిజన్లకు ప్రస్తుతం అమలులో ఉన్న వేతన సవరణ గడవు ముగుస్తుందని కావున 2026 కు సంబంధించిన సంప్రదింపుల కమిటీ ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరిగిందని కమిటీని వెంటనే ఏర్పాటు చేసి అమలులోకి తీసుకురావాల్సిందిగా కోరడం జరిగిందని తెలిపారు. జేఏసీ నేతలు తాజుద్దీన్, వజీర్, మహేష్, వెంకన్న గౌడ్, సుధాకర్ రెడ్డి, కుమారస్వామి, శ్యామమనోహర్, ఈశ్వర్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, గోవర్ధన్, సత్యనారాయణ రావు, భాను ప్రకాష్, సదానందం, సురేష్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సైబరాబాద్ కమిషనర్ గారూ.. జర అక్రమ నిర్మాణాలపై నజర్ వేయండి : కొండల్‌రెడ్డి

**శేరిలింగంపల్లి,మార్చి 16 ప్రభాతవార్త :** శేరిలిగంపల్లి నియోజకవర్గంలోని జంట సర్కిళ్లలో టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సమగ్రవిచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డినగర్‌వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సైబరాబాద్ మునిసిఫల్ కమిషర్ సృజనకు ప్రజావాణిలో వినతిపత్రాన్ని సమర్పించారు.. ఈ సందర్భంగా బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని డోయన్స్ కాలనీ,సుదర్శన్‌నగర్,విస్పర్ వాల్యూ సర్వేనంబర్ 48, మదీనాగూడ,శిల్పాగార్డెన్,కాంట్రాక్టర్స్ క్లబ్ కార్యాలయం,కొండాపూర్ చుట్టుపక్కల వివిధ కాలనీల్లో అక్రమంగా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయన్నారు. వీటిపై ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా అక్రమాలకు పాల్పడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఏలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. కొండాపూర్, కొత్తగూడ, రాజరాజేశ్వరి నగర్, రాఘవేంద్రనగర్,శ్రీరాంనగర్,నానక్‌రాంగూడ, టీఎన్‌జీఓ కాలనీ, గౌలిదొడ్డి,గచ్చిబౌలి,గోపన్‌పల్లి, యంఐజీ,నల్లగండ్ల తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నా అక్రమ నిర్మాణదారుల వద్ద డిప్యూటి కమిషనర్,సిటీ ప్లానర్, ఏసీపీ,టీపీఎస్, చైన్‌మెన్ల వరకు లక్షల రూపాయలు లంచాలు తీసుకుని డివియేషన్ లేకుండా అక్యూపెన్సీ సర్టిఫికెట్లు ఇచ్చి అక్రమ నిర్మాణాలకు కొమ్ము కాస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆయా కాలనీల్లో 50,100,200 గజాల స్థలంలో 5ప్లస్ 1 ఫ్లోర్లు అక్రమంగా నిర్మాణాలను చేయటంతో ఏదైనా ప్రమాదం జరిగితే విలువైన ఆస్థినష్టంతో పాటు ప్రాణనష్టం కూడా జరుగుతున్నాయన్నారు. కొందరు ఇంటి అనుమతులు తీసుకుని వ్యాపార సముదాయాలు, హస్టల్స్ తదితర నిర్మానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సదరు ప్రాతాల్లో అధికారులు ఇచ్చిన అనుమతులపై అక్యూపెన్సీ సర్టిఫికెట్లపై సమగ్రమైన విచారణ చేస్తే చాలా విషయాలు తేటతెల్లమవుతాయన్నారు. మాదాపూర్ డివిజన్ అయ్యప్ప సొసైటీ,గోకుల్ ప్లాట్స్, అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్, మాతృశ్రీనగర్, మైత్రినగర్, హఫీజ్‌పేట్,ఖానామెట్,మాదాపూర్,పిజేఆర్‌నగర్;నందిహిల్స్, దర్గా తదితర ప్రాంతాల్లో 50 గజాల నుంచి 200 గజాల లోపు స్థలాల్లో 5ప్లస్ 1 అంతస్థులు అక్రమంగా నిర్మాణాలు చేసి కనీసం పార్కింగ్ సదుపాయాలు లేకుండా బహుళ అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారని, అక్రమ భవన నిర్మాణదారుల నుంచి లక్షల్లో లంచాలను తీసుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని, వీరిపై సమగ్రంగా విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు,చైన్‌మెన్‌లపై చట్టబద్దంగా కఠిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మునిసిఫల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పించినట్లు ఆయన తెలిపారు.

### ఎమ్మార్వో కార్యాలయం వద్ద బిజెపి శ్రేణుల ధర్నా...



ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 16, ప్రభాతవార్త :** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కెపిహెచ్‌బి ఎం.ఆర్.ఓ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వం నిరక్ష్య ధోరణి అవలంబిస్తోందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎన్నో హామీలు ఇచ్చినా ఇప్పటివరకు వాటిలో ఏ ఒక్కదానిని సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పోరాటంలో నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాధవరం కాంతారావు, కూకట్‌పల్లి అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యాంజల పద్మయ్య, కెపిహెచ్‌బి కంటెస్టెంట్ కార్పొరేటర్ ప్రీతం రెడ్డి, నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షులు కంటెస్టెడ్ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆమెకు ఆమే సాటి.. సామాజిక మార్పు కోసం నృత్యం : పి.ఎన్. మూర్తి



నృత్య గురువులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి మార్చి 16 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం, చినుకు ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ గ్యాలరీలో ఖీఆమెకు ఆమె సాటి పేరుతో శాస్త్రీయ నృత్య గురువుల సమావేశం జరిగింది. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చినుకు సంస్థ వ్యవస్థాపకులు, ప్రముఖ కవి విశ్లేషకులు పి.ఎన్. మూర్తి మాట్లాడుతూ.. కళలు కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా సామాజిక మార్పు కోసం దోహదపడాలని ఆకాంక్షించారు. సమాజంలో వేళ్లూనుకున్న కుల వివక్షను రూపుమాపి, కులరహిత సమాజ స్థాపన కోసం నృత్య కళలను ఒక సాధనంగా ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన పోరాట గీతాలకు, సమానత్వాన్ని ప్రబోధించే పాటలకు శాస్త్రీయ నృత్య రూపం కల్పించి నేటి తరానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏప్రిల్ 11 నుండి 14 వరకు నిర్వహించనున్న కుల నిర్మూలన ఉత్సవాలలో భాగంగా జరిగే నృత్య నీరాజనం కార్యక్రమంలో నగరంలోని శాస్త్రీయ నృత్య గురువులు తమ శిష్య బృందాలతో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చినుకు కల్చరల్ సొసైటీ ప్రతినిధులు జి. లావణ్య, రాధిక శ్రీనివాస్, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నృత్య గురువులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు, పాల్గొన్న గురువులందరికీ ఆచార్య ఘంటసాల పవన్ కుమార్, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు వరుణ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరతనాట్యం, ఒడిసి, యోగా, కోలాటం రంగాలకు చెందిన నృత్య గురువులు స్వర్ణలత, వైశాకి, ప్రతిభారాజ్, జ్ఞానేశ్వరి, ఇందిరా, శృతి, శిరీష, రాజ్యలక్ష్మి, జూనియర్ చిరంజీవి, ఎస్సార్ వెంకన్న పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్.. మూడు వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపిస్తున్న ఇన్స్‌పెక్టర్ మహేష్ ఇతర పోలీస్ సిబ్బంది

**తార్నాక, మార్చి 16 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లాకు చెందిన చిరుమల్ల రాజ్ కుమార్ తార్నాకలో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన తన వాహనం దొంగతనానికి గురైందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులుగా అరొల్ల భారత్ (24), డామెర కార్తిక్ (22)లను గుర్తించి అరెస్ట్ చేశారు. అరొల్ల భారత్ సిద్ధిపేటలో జన్మించి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉడాన్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. డామెర కార్తిక్ రామంతాపూర్‌కు చెందినవాడు, బ్యాండ్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు.పోలీసుల విచారణలో ఇద్దరూ స్నేహితులుగా ఉండి ధూమపానం, గుట్కా వంటి చెడు అలవాట్లకు బానిసలై తక్కువ ఆదాయంతో విలాసవంతమైన జీవితం గడపడానికి సులభంగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ఇద్దరూ ఇళ్ల ముందు, షాపుల ముందు లేదా రోడ్డు పక్కన పార్క్ చేసిన వాహనాల తాళాలు బలవంతంగా విరగగొట్టి దొంగతనాలు చేసి తెలియని వ్యక్తులకు విక్రయించేవారని పోలీసులు తెలిపారు.పోలీసులకు అందిన సమాచారం మేరకు అంబర్‌పేట్ డీడీ కాలనీలో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మూడు దొంగతనం చేసిన వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో హీరో గ్లామర్, హోండా యాక్టివా,హోండా డియో వాహనాలు ఉన్నాయి. నిందితులను సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.ఈ కేసును విజయవంతంగా ఛేదించిన ఓయూ సిటీ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఏసిపి జగన్, ఇన్స్పెక్టర్ మహేష్ అభినందించారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల ముందస్తు అరెస్ట్



అల్లాపూర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసిన అల్లాపూర్ పోలీసులు.

**యూసుఫ్‌గూడ, మార్చి 16, ప్రభాతవార్త :**
అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చలో అసెంబ్లీకి తరలి వెళ్తున్న తరుణంలో ముందస్తు భాగంగా సోమవారం అల్లాపూర్ పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తమకు ప్రతి నెల సరైన విధంగా వేతనాలు అందటం లేదని ఈ నెల 17వ తారీఖు వచ్చినప్పటికీ ఇంత వరకు వేతనాలు లేక తమ కుటుంబాల పోషణ భారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాలలో ఉండటంతో రెంటు చెల్లించక పోవడంతో యజమానులు ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. తమకు ఫోన్లు కూడా సరిగా లేవని యాప్స్ పనిచేయడం లేదని దీంతో వారికి మెమో ఇస్తామని ఉన్నతాధికారులు భయపెడుతున్నారన్నారు. తమకు ఈఎస్ఐ, టీఏ, డీఏలు లేవని తెలిపారు. కనీస వేతనాలు అందేలా చూడాలని కోరారు. అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీ కార్యకర్తలను సొంత పూచికత్తుతో వదిలేశామని అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. అరెస్టు అయిన వారిలో లక్ష్మి, సౌజన్య, సారిక, అరుణ, రమాదేవి, హేమలతా ఉన్నారు.

### రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర సరుకుల పంపిణీ



అల్లాపూర్ చౌరస్తాలో పేద ముస్లింలకు రంజాను సందర్భంగా నిత్యావసర సరుకులను అందజేస్తున్న డాక్టర్ నీలిమ.

**యూసుఫ్‌గూడ, మార్చి 16, ప్రభాతవార్త :**
పవిత్ర రంజాను మాసంలో పేద ముస్లింలకు తమ వంతుగా నిత్యావసర సరుకులను అందివ్వడం జరుగుతుందని డాక్టర్ నీలిమ తెలిపారు. ప్రతిసారి రంజాను మాసంలో పేదలకు నిత్యావసర సరుకులను అందిస్తున్నామని అందులో భాగంగానే ఈ సంవత్సరం కూడా పెద్దఎత్తున అందివ్వడం జరిగిందని డాక్టర్ నీలిమా శ్రీనివాస్ పేర్కొన్నారు.

## ఏప్రిల్ 4న 'హిందూ సమ్మేళనం'



హిందూ సమ్మేళనం వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పెండ్యాల రామకృష్ణ, వేముల రామకృష్ణ, బాలరాజ్, అమరేందర్, పెంటయ్య తదితరులు

**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త :** ఏప్రిల్ 4న హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి నిర్వాహకులు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం మైదానంలో వచ్చే నెల 4వ తేదీన సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున పాల్గొనాలని హిందూ సమ్మేళనం నిర్వాహక కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు బాలరాజ్, ప్రధన కార్యదర్శి అమరేందర్, సంయుక్త కోశాధికారి పెంటయ్య, ప్రచార కమిటీ నేత, బిసి విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణలు పిలుపు నిచ్చారు. సోమవారం రాజేంద్రనగర్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో వారు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులను ఒకతాటిపైకి తెచ్చి సనాతన ధర్మం పరిరక్షణ కోసం భవిష్యత్తు తరాలకు ఆధ్యాత్మిక విలువలు అందించేందుకు హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలన్న దయ్యంతో హిందూ మేళనం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా, దైవిక రక్షణ, కుటుంబాల ఆశీర్వాదం కోసం ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం వంటి విలువలను పెంపొందించేందుకు హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు.

## బండ్లగూడ డివిజన్‌లో రంజాన్ తోఫాలు పంపిణీ



బండ్లగూడ డివిజన్‌లో రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు.

**నార్సింగి, మార్చి 16 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బండ్లగూడ డివిజన్ నర్సారెడ్డి కాలనీలో సోమవారం పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ వేడుకలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్, సురేష్‌గౌడ్, హఫీజ్‌ఖాన్, నదీం తదితరులు పాల్గొని పేదలకు తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎవరి మతాలను వారు ఆచరిస్తూ, ఇతరుల మతాలను గౌరవించినప్పుడే సోదరభావం పెరుగుతుందన్నారు. ముస్లింలు పవిత్ర రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముస్లిం,మైనార్టీల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహకరిస్తున్నారన్నారు. రంజాన్ తోఫాలను పంపిణీ చేసి ప్రత్యేక అభిమానంను చాటుకున్నారని తెలిపారు. అందరికి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యక్షులు షేక్ సర్దార్ అలీ, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి ఖాలిద్ సిద్దిఖీ, నర్సారెడ్డి కాలనీ అధ్యక్షులు మస్తాన్‌అలీ, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

### పోలియో, కరోనా వంటి మహమ్మారులను టీకాల ద్వారానే తరిమికొట్టగలిగాం : మనోహార్ రెడ్డి



బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో జాతీయ టీకా దినోత్సవం కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి మార్చి 16,ప్రభాతవార్త:**
వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో రాజబహదూర్ వెంకటరామ రెడ్డి ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ టీకా దినోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యాధుల నివారణలో టీకాల ప్రాముఖ్యతను వివరించారు. వ్యాధి వచ్చాక బాధపడటం కంటే, రాకముందే టీకాలు వేయించుకోవడం మేలు" అని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. పోలియో, కరోనా వంటి మహమ్మారులను టీకాల ద్వారానే తరిమికొట్టగలిగామని వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ ప్రెసిడెంట్ నాగభూషణం, డిస్ట్రిక్ట్ 301 గవర్నర్ డాక్టర్ బి. గంగాధర్ రెడ్డి, అదనపు ఉపాధ్యక్షుడు ఎస్.మురళీ కృష్ణ, సంపత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రమేష్ రెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. క్లబ్ ప్రెసిడెంట్ ఎస్. మనోహర్ రెడ్డి, సెక్రటరీ ఎం. దశరథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంజాగుట్టలో కారు ఢీకొని రోడ్డు దాటుతున్న ఆటోడ్రైవర్ మృతి

**జూబ్లీహిల్స్, మార్చి 16, ప్రభాతవార్త:**
పంజాగుట్టలో సోమవారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న ఒక ఆటోడ్రైవర్‌ను ఒక కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన ఎం. వెంకటనర్సింహారెడ్డి(67) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అమీర్‌పేటలో రోడ్డు దాటి టీ తాగి వస్తుండగా అటువైపుగా వచ్చిన ఒక కారు అతన్ని ఢీకొంది. ఈ సంఘటనలో నర్సింహారెడ్డి తలకు, కాళ్లకు తీవ్రగాయాలై రక్తస్రావమైంది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పంజాగుట్ట పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్నారు. కారు నడుపుతున్న వ్యక్తిని మియాపూర్ ప్రాంతానికి చెందిన జి. ఆదిత్య(34)గా గుర్తించారు. అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా రక్తంలో మద్యం మోతాదు శాతం 80 ఎంజీగా తేలింది. దీంతో అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారును స్వాధీనం చేసుకున్నారు.

# రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో నిధుల గోల్‌మాల్..!?

-నేనే రాజు నేనే మంత్రి అనే ధోరణిలో సంఘం అధ్యక్షుడు
-ఆరేళ్లుగా లెక్కలు చూపకుండా దాటవేస్తున్న వైనం
-కన్నెత్తి చూడని నాబార్డ్



కుందనవానిపల్లిలోని ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఫర్టిలైజర్ దృశ్యం

**అక్కన్నపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
ఓ రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో అవినీతి రాజ్యమేలుతోంది. ఆ సంఘం అధ్యక్షుడు నేనే రాజు నేనే మంత్రి అనే ధోరణిలో వ్యవహరిస్తున్నాడంటూ సంఘం డైరెక్టర్లు, సభ్యులు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. అక్కన్నపేట మండలంలోని మైసమ్మవాగుతండా, కుందనవానిపల్లి, గండిపల్లి గ్రామాల రైతులు నాబార్డ్ ఆధ్వర్యంలో దాదాపు ఏడు సంవత్సరాల క్రితం ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటుచేశారు. ఈసంస్థలో సుమారు 500మంది రైతులు సభ్యులుగా చేరి ఒక్కొక్కరు రూ.1000 చొప్పున చెల్లించి మొత్తం రూ.5లక్షల నిధులు సమీకరించారు. సేకరించిన నిధులతో కుందనవానిపల్లిలో ఫర్టిలైజర్‌షాపును ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారని, అయితే ఈ షాప్‌ను, సిఈఓగా వ్యవహరిస్తున్న చొక్కం గణేష్, అధ్యక్షుడు స్వామిరెడ్డి ఆధ్వర్యంలో నడుపుతూ సంస్థకు సంబంధించిన లెక్కలు, ఆదాయం, ఖర్చుల వివరాలు సభ్యులకు వెల్లడించడంలేదని డైరెక్టర్లు, సభ్యులు చెబుతున్నారు.

ఇక సంస్థ అధ్యక్షుడిగా ఉన్న ఏలేటి సామిరెడ్డి గత ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా సభ్యులతో సమావేశాలు నిర్వహించకుండా, సంస్థనిధులవివరాలు వెల్లడించకుండా స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నాడని వారు అంటున్నారు. చెల్లించిన డబ్బులగురించి అడిగితే స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా కాలం దాటవేస్తున్నాడని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్థ ద్వారా వడ్ల కొనుగోలు, జనుము కొనుగోలు చేయగా వాటి లెక్కలు చూపకుండా, అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని వాపోతున్నారు. సంస్థ డైరెక్టర్లు ఎవరు అన్న విషయంలో కూడా స్పష్టత లేకుండా అధ్యక్షుడు స్వామిరెడ్డి ఒకరి పేరు చెబుతుండగా, షాప్ నిర్వహిస్తున్న సిఈవో గణేష్ వేరే పేర్లు చెప్పడం వెనక అవినీతి దాగి ఉందని సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సభ్యులుగా ఉన్న తమకు నిర్వాహకులు ఒక్క బస్తా ఉద్దెర కావాలని బతిమాలినా ఇవ్వడంలేదని, కానీ అదే షాపు నడిపించిన వ్యక్తి తనకు దగ్గరి వ్యక్తులకు, రైతులకు లక్షల విలువచేసే ఎరువులబస్తాలు అరువుకు అందించారని ఆమొత్తాన్ని ఇప్పటివరకు కూడా సంఘానికి చెల్లించలేదని వివరించారు. అంతేకాకుండా షాప్ నిర్వాహకులు సంఘం సొమ్మును వారి వ్యక్తిగత అవసరాలకు కూడా వాడుకుంటూ అడిగితే మాట దాటవేస్తున్నారని అన్నారు. ఇకనైనా సంస్థ ఆదాయం, ఖర్చులు, లాభనష్టాలపై పూర్తి వివరాలు వెల్లడించి సభ్యులకు స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్‌చేస్తున్నారు. నాబార్డ్ అధికారులు ఈ విషయంపై ప్రత్యేకదృష్టి సారించి రైతు ఉత్పత్తిదారులసంఘం డబ్బులు పక్కదారిపట్టకుండా చర్యలుతీసుకోవాలని వేడుకుంటున్నారు.

**తీర్మానం చేసుకునే పనులు మొదలు పెడతాం...**
**-సంఘం అధ్యక్షులు స్వామిరెడ్డి**

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో నిధుల గోల్‌మాల్ విషయంలో ప్రభాతవార్త సంఘం అధ్యక్షుని వివరణ కోరగా తమసంఘంలో ఎలాంటిపనులు మొదలుపెట్టినా సంఘంలోని డైరెక్టర్లతో సమావేశం నిర్వహించడంతోపాటు తీర్మానాలు చేసిన తర్వాతనే పనులు ప్రారంభిస్తామని ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అధ్యక్షుడు ఏలేటి సామిరెడ్డి అన్నారు. ప్రతి లావాదేవీ విషయంలోనూ డైరెక్టర్లతో సమావేశం పెట్టకుండా ఏపనిచేయలేదని అన్నారు.

**షాప్ సిఈవో గణేష్‌ను వివరణ...**

ఈవిషయంపై షాప్ సిఈవో గణేష్‌ను వివరణకోరగా ప్రతినెల తమరికార్డులలో డైరెక్టర్ల సంతకాలు తీసుకుంటున్నామని, ప్రతినెల నిర్వహించే సమావేశంలో లావాదేవీల మీద తమకు చర్చలు జరుగుతాయన్నారు. ఈవిషయంలో నాబార్డ్ చైర్మన్ మూగ జయశ్రీని వివరణ కోరేందుకు సంప్రతించగా వారు అందుబాటులోకి రాలేదు.

## ఘనంగా మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం

**చిన్నశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
మండలపరిధి భాగీర్తిపల్లి గ్రామంలో శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామివారి కళ్యాణమహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈకళ్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్వామివారిదయతో ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని కోరుకున్నట్లు వారుతెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్, ఆంజనేయులుగౌడ్, సర్పంచులు సావిత్రి, చిలుకా నాగరాజు, ఇమ్మడి నరేష్, నాయకులు దయాకర్‌యాదవ్, పోచయ్య, లక్ష్మారెడ్డి, పూలపల్లి యాదగిరియాదవ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బిఆర్ఎస్‌పార్టీ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న హనుమంతరావు

**చిన్నశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు అన్నారు. సోమవారం మండల పరిధి కొర్విపల్లి తండాలో భవాని మాత, సేవాలాల్ ఆలయ నిర్మాణానికి హనుమంతరావు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక, భక్తి భావం పెరుగుతుందన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ ఆలయం, దుర్గామాత నిర్మాణానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సర్పంచి పుల్లా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా అవుసుల భవాని

**పెద్దశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలుగా అవుసుల భవాని తిరిగి నియామకమయ్యారు. గతంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా ఉన్న భవాని పార్టీకి రాజీనామాచేసి బిఆర్ఎస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం సూచనమేరకు భవాని తిరిగి సోమవారం గాంధీభవన్‌లోని మహిళా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎఐసిసి మహిళా అధ్యక్షురాలు అలకలాంబ, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సూచన మేరకు తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆమె తెలిపారు. దీంతో మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అవుసుల భవానిని తిరిగి నియమించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర

**అమీన్‌పూర్, మార్చి 16, ప్రభాతవార్త:**
అమీన్‌పూర్‌డివిజన్ పరిధిలోని జానకంపేట్‌గ్రామంలో జరిగిన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివారి ఉత్సవానికి హాజరైన పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్‌కు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు.

## పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



ఆసుపత్రిలో రికార్డులను తనిఖీచేస్తున్న వైద్యాధికారి శ్రీరామ్

**చిన్నశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
చిన్నశంకరంపేట పట్టణంలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఈనెల 28వ తేదీన ఆసుపత్రికి ఎముకలు, చిన్నపిల్లలు, కంటివైద్య నిపుణులు, మహిళావైద్య నిపుణులు, క్యాన్సర్, బిపి, షుగర్ వైద్యులను పంపడం జరుగుతుందని, మండలంలోని అన్నిగ్రామాలలో సర్వేద్వారాగుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయిసింధు, హరిక, యాదగిరి, నిర్మల, బుజ్జి, సూపర్‌వైజర్ వనిత, అనిత, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చౌడలమ్మ మల్లికార్జునస్వామి కళ్యాణం

**కొండపాక, మార్చి 16, ప్రభాతవార్త:**
కొండపాక మండల పరిధిలోని బందారం గ్రామంలో గత మూడు రోజుల నుండి జరుగుతున్న చౌడలమ్మ మల్లికార్జునస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సోమవారం మల్లికార్జునస్వామి కళ్యాణోత్సవానికి డిసిసిబి మాజీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సర్పంచి కొలుపుల గంగధర్, ఎఎంసి వైస్ చైర్మన్ బట్ట పర్శరాములును యాదవ సంఘం కుల పెద్దలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా రైతు బందు సమితి మండల కో ఆర్డినేటర్ ర్యాగల దుర్గయ్య శ్రీకృష్ణ యాదవ సంఘానికి రూ.25వేలు విరళంగా అందించారు. ఈ సందర్భంగా అయనను కుల సంఘం నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపి నాయకులు

**పాపన్నపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించాలని బిజెపిపార్టీ మండలశాఖ అధ్యక్షుడు వడ్ల సంతోష్‌చారి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.కొండరాములు, ఆకుల సుధాకర్, శంకరయ్య, చంద్రయ్య, లక్ష్మణ్, బొక్కల బాగేష్, కోళ్ల మల్లేశం, మైనార్టీ మోర్చా అధ్యక్షులు గౌస్ ఓబిసి మోర్చా వడ్లభాగేష్, మండలనాయకులు సంతోష్‌గౌడ్, మల్లేశం, దుర్గయ్య, పెంటయ్య, నర్సింలు, బాబు, మండల నాయకులు పాల్గొన్నారు.

## గౌరవంగా బ్రతకండి, హుందాగా జీవించండి..

-మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్



ట్రాన్స్‌జెండర్లకు అవగాహన సదస్సులో డిఎస్పీ ప్రసన్నకుమార్

**పాపన్నపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
ట్రాన్స్‌జెండర్స్ గౌరవంగా బ్రతికి హుందాగా జీవించడం అలవరుచుకొని ప్రజల మన్ననలు పొందాలని మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన పాపన్నపేట మంజీరా గార్డెన్‌లో ట్రాన్స్‌జెండర్స్‌లకు అవగాహన సదస్సు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు ప్రభుత్వపథకాలను అందిపుచ్చుకొని సమాజంలో మంచిస్థానం సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరికీ జీవించే హక్కు ఉందని ట్రాన్స్‌జెండర్లను ఎవ్వరూ కించపరిచేవిధంగా వ్యవహరించవద్దని వారి పట్ల గౌరవంగా మెలగాలని, ఎవరైనా హేళనచేయకూడదని, వారూ మనలాగే మనుషులే అని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ మండలంలోని శుభకార్యాలు, పుణ్యక్షేత్రాలవద్ద ఏర్పాటుచేసుకున్న ఫంక్షన్‌లకు వెళ్ళి అసభ్యంగా ప్రవర్తిస్తూ డబ్బులు డిమాండ్‌చేస్తూ వీరంగం సృష్టిస్తూ వారి శుభకార్యాలను డిస్టర్బ్ చేయడమేకాకుండా కించపర్చున్నారని తమదృష్టికి వచ్చిందని, శుభకార్య నిర్వాహకులను ఇబ్బందులకు గురిచేయవద్దనీ, అలాచేస్తే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, రూరల్ సిఐ జార్జ్, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నీరుడి వెంకటేశం, ట్రాన్స్‌జెండర్స్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, వివిధగ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, యువకులు, పాపన్నపేట పోలీసులు పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ యోజన సాయం ప్రతి ఒక్కరికీ..

-వ్యవసాయ అధికారికి బిజెపి నాయకుల వినతిపత్రం



వ్యవసాయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బిజెపి నాయకులు

**రామాయంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
కేంద్రంలోని మోడీప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం ద్వారా రైతులకు అందుతున్న పెట్టుబడి సాయం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని బిజెపి నాయకులు డిమాండ్‌చేశారు. సోమవారం బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాయంపేట వ్యవసాయ అధికారి(ఏఓ)ని కలిసి వినతిపత్రం అందజేశారు.

## ఉపాధిహామీని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

-కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

**వర్గల్, మార్చి 16, ప్రభాతవార్త:**
గ్రామీణప్రాంత కూలీలు, నిరుపేద రైతుల కడుపు నింపుతున్న ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి విమర్శించారు. సోమవారం వర్గల్, తునికిఖాల్సా, తునికిమక్త, మీనాజిపేట, శాకారం, అంబర్‌పేట గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో విధానసభలు ఏర్పాటుచేసి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచారకమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, ఆయాగ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు విజయలక్ష్మి యాదగిరి, కొండగల్ల గణేష్, కుమార్‌యాదవ్, గోరేమియా, గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మి, సహదేవ్‌గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, పంజాల సాయిగౌడ్, నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహగద్దె కూల్చడం దురదృష్టకరం

-జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి



కూల్చిన అంబేద్కర్ విగ్రహ గద్దెను పరిశీలిస్తున్న కొట్టాల యాదగిరి

**వర్గల్, మార్చి 16 (ప్రభాతవార్త):**
రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ గద్దెను కూల్చడం దురదృష్టకరమని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి అన్నారు. వర్గల్ మండలం నాచారం వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దె కూల్చిన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండుగళ్ల కిషన్, జిల్లా అధ్యక్షులు ముకద్దం సుధాకర్, నాచారం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య రాకుండా చూసుకోవాలి



బోరును పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ సంపత్‌కుమార్

**చిన్నశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలుతీసుకోవాలని ఇంజనీరింగ్ ఎగ్జిక్యూటివ్ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలపరిధి చందంపేటలో మరమ్మతులో ఉన్న మంచినీటి బోరును పరిశీలించారు. వేసవికాలం ఉన్నందున గ్రామంలో త్రాగునీటికి సమస్య పరిష్కారానికి ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనవెంట సర్పంచి నాయిని ప్రవీణ్‌కుమార్, ఏఈ స్వప్న, పంచాయతీ కార్యదర్శి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి వైభవంగా బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

**పెద్దశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని తిరుమలాపురంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం అమ్మవారికి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని బోనాల సమర్పించారు. ఆలయ ధర్మకర్త విగ్రాంరాజన్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## హుస్నాబాద్ అంగడి టెండర్‌లో ఆదాయం తగ్గించొద్దు

-మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించిన బిఆర్ఎస్ నాయకులు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ మున్సిపల్‌కు వచ్చే అంగడి టెండర్ ఆదాయం తగ్గకుండా చర్యలుతీసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికారప్రతినిధి అయిలేని మల్లికార్జునరెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే అంగడిలో పశువుల కొనుగోలు, అమ్మకాలు చేసే రైతులు, చిరువ్యాపారులు ఆర్థిక ఇబ్బందులు పడకుండా రేట్లు పెంచవద్దని కోరారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం అంగడి టెండర్ ప్రక్రియలో కొంతమంది టెండర్‌దారులు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపల్‌కువచ్చే ఆదాయానికి లక్షల రూపాయల నష్టం కలిగించారని ఆరోపించారు. అదే సమయంలో రైతులపై అధిక రుసుములు వేయించి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. కొంతమంది టెండర్‌దారులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై పనిచేసినట్టు అనుమానాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 2026-2027 సంవత్సరానికి జరగనున్న అంగడి టెండర్‌ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని డిమాండ్‌చేశారు. టెండర్ దరఖాస్తుదారులు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపల్ ఆదాయాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొజ్జ హరీష్, కందుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

-మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

**చిన్నశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడం లేదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. సోమవారం స్థానికవిలేకరులతో మాట్లాడుతూ ఎండాకాలం మొదలైందో లేదో అప్పుడే కరెంట్‌కష్టాలు మొదలయ్యాయని, దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యూరియాకోసం రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యుత్, యూరియా ఇబ్బందుల్ని తొలగించాలని, లేనిపక్షంలో తమపార్టీ రైతులపక్షాన పోరాడుతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, మాజీ జడ్పీటీసీ మాధవి,నాయకులు లక్ష్మారెడ్డి, సావిత్రి, నరేష్, దయానంద్ యాదవ్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌కు బిజెపి నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

**వర్గల్, మార్చి 16, ప్రభాతవార్త:**
బిజెపి వర్గల్ మండల అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మెదక్ ఎంపి రఘునందన్‌రావు సూచనతో వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రామాంజనేయులు, చిరంజీవి, వెంకటేష్, బూత్ అధ్యక్షుడు బద్రినాథ్, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, మఠం మహిపాల్, బబ్బూరి రవీందర్, శంకర్‌గౌడ్, బర్కం నాగరాజు, నరేందర్‌రెడ్డి, బన్నీ రెడ్డి, పరశురాంగౌడ్, మహేందర్‌గౌడ్, కాశి, వెంకటేష్ పాల్గొన్నారు.

## మోడీ ప్రభుత్వ వైఫల్యంతోనే చమురు సంక్షోభం

-సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
దేశంలో నెలకొన్న చమురు సంక్షోభం కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ వైఫల్యాల ఫలితమేనని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ విమర్శించారు. గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, చమురు సంక్షోభాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, సిపిఐ నాయకులు పిట్ల మల్లేశం, భిక్షపతి, నర్సిములు, మహేందర్, భూమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్లకు ఘనంగా సన్మానం

**గజ్వేల్, మార్చి 16, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన 4, 5 వార్డుల కౌన్సిలర్లు రొట్టెల శ్రీనివాస్, మన్నె రూప వెంకటేష్‌లను సోమవారం స్ప్రింగ్ ఫీల్డ్ ఇన్ఫ్రా కాలనీ వాసులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు తీగుల్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా వార్డుల కౌన్సిలర్లు వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని, కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు బెదరబోయిన మల్లేశం, కోశాధికారి సిరిసిల్ల శంకర్, తోట లక్ష్మణ్, చెప్యాల రాజేశ్వర్‌రావు, గొడుగు రాజు, నరేష్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు కానిస్టేబుళ్లపై క్రమశిక్షణ చర్యలు?

**ములుగు, మార్చి 16, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన ములుగు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురిపై సిద్దిపేట సిపి క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల మంత్రి కొండా సురేఖ రాజీవ్‌రహదారిపైనుండి వెళ్తున్న సందర్భంలో కానిస్టేబుళ్లకు అక్కడ బందోబస్తు ఉండాలని తెలుపగా వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. ఇది తెలుసుకున్న సిద్దిపేట సిపి వారిని తన వద్దకు పిలిపించుకొని విచారణ జరిపి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిని సస్పెండ్‌చేసినట్లు సమాచారం. ఇదిలా వుండగా మండల పరిధిలోని ఓసర్పంచి గ్రామానికి సంబంధించి, ఓపనిపై ములుగు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓసీనియర్ కానిస్టేబుల్‌కు ఫోన్‌చేయగా అతను సర్పంచితో పద్ధతిలేకుండా బూతులు మాట్లాడగా, సర్పంచి అతని మాటలను రికార్డ్‌చేసి పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినట్లు తెలిసింది. ఈ విషయంలో ఆ కానిస్టేబుల్‌ను కూడా సస్పెండ్‌చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తుంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే తమ విధులను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల పలువురు స్థానికులు విమర్శిస్తున్నారు.

## యుద్ధం సాకుతో గ్యాస్ ధరలు పెంచవద్దు

-సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కృష్ణ



గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న సిపిఐ పార్టీ నాయకులు

**గజ్వేల్ టౌన్, మార్చి 16, ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం యుద్ధం సాకుతో గ్యాస్ ధరలు పెంచవద్దని, సామాన్య ప్రజలకు గ్యాస్ అందుబాటులో ఉంచాలని సిపిఐపార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగకృష్ణ అన్నారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధం వల్ల ఆయిల్ కొరత ఏర్పడి ఇప్పటికే దేశంలో చాలా రాష్ట్రాలలో గ్యాస్‌కు ఇబ్బంది జరుగుతుందని ప్రభుత్వమే చెబుతుందని అన్నారు. దేశంలో గ్యాస్ కొరతను ఎదుర్కోవడానికి తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి శ్రీను, గజ్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్రం, శ్రీను, సిపిఐ నాయకులు పోతుల శంకరయ్య, నర్సింలు, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

**పెద్దశంకరంపేట, మార్చి 16, ప్రభాతవార్త:**
ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం బాధ్యులు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం సాధించేందుకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కందుకూరి రవీందర్, యువజన సంఘం అధ్యక్షులు గడ్డం మల్లేశం,మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కన్నయ్య గారి రమేష్ గుప్తా, ఆర్యవైశ్య సంఘం బాధ్యులు దాదిగారు గంగాధర్, బొడ్ల ప్రకాశం, అనిల్ కుమార్, రవీందర్, శివశంకర్, కేతకి సంగమేశ్వర్, ఆనంద్‌కుమార్, తదితరులున్నారు.

# అంగడిలో అక్రమ పశు రవాణా నిలిపివేయాలి

## -వెటర్నరీ డాక్టర్ అనుమతి తప్పనిసరి చేయాలని కలెక్టర్‌కు వినతి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ప్రతివారం నిర్వహించే అంగడిలో నిబంధనలకువిరుద్ధంగా పశువులను వధశాలలకు తరలిస్తున్నారని, ఈ నేపథ్యంలో అక్రమరవాణాను అరికట్టేందుకు తగినచర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పశువుల అంగడిని టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించడం జరుగుతుందని, ఒకప్పుడు హుస్నాబాద్ మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల్లో గణనీయమైన పశుసంపద ఉండేదని, ప్రస్తుతం కొందరు కటిక వ్యాపారస్థులు వెటర్నరీ డాక్టర్ అనుమతి లేకుండానే ఆరోగ్యకరమైన ఆవులు, గేదెలు, దూడలు, లేగలను నిబంధనలకు విరుద్ధంగా పశువధశాలలకు తరలిస్తున్నారని ఆరోపించారు. అంగడినిర్వహించే ప్రతివారం వెటర్నరీ డాక్టర్ల అనుమతితీసుకున్న తర్వాత మాత్రమే పశువులను ఎగుమతి చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కటిక వ్యాపారులు రైతులకంటె అధికధరలు చెల్లించి పశువులను కొనుగోలు చేయడంవల్ల రైతులు పాలు ఇచ్చే గేదెలు, నాగలి నడిపే ఎద్దులను కొనుగోలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల 18వతేదీన హుస్నాబాద్ పశు అంగడి వేలంపాటలో పాల్గొనేవారికి నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికితీసుకెళ్లి తగినచర్యలుతీసుకోవాలని కోరినట్లు రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

## మల్లన్నస్వామికి బోనాల జాతర



భక్తుల పూజలు అందుకుంటున్న మల్లికార్జున స్వామి దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 16, ప్రభాతవార్త:** మండలపరిధిలోని కాయితంపల్లి గ్రామశివారులో వెలిసిన శ్రీమల్లికార్జున స్వామి ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. గొల్లకురుమ సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జాతరలో భాగంగా సోమవారం స్వామివారికి గ్రామమహిళలు తమ ఇళ్లనుంచి బోనాలతో గ్రామచావిడి వద్దకు చేరుకుని అక్కడినుంచి బైండ్లవారి చప్పుడు, గొల్లకురుముల డోలువాయిద్యాల మధ్య మహిళలు సామూహికంగా బోనాలను ఊరేగిస్తూ ఆలయానికి చేరుకుని స్వామివారికి బోనాలుసమర్పించి పూజాకార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఉత్సవాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## నేడు విద్యార్థులకు ఆటల పోటీలు

**మనూర్, మార్చి 16, ప్రభాతవార్త:** తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో విద్యను అందుకునేందుకు అడ్మిషన్‌ల కొరకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 17న మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండలవిద్యాధికారి రాజశేఖర్ శెట్కార్ తెలిపారు. మండలకేంద్రమైన మనూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉదయం 9గం పాఠశాలకు చేరుకోవాలని రాజశేఖర్ శెట్కార్ వివరించారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### -కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**సిద్ధిపేట అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో జరుగుతున్న జాప్యం మూలంగా ఆధ్యాపకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విపి.రాజు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 5నెలలుగా జీతాల చెల్లింపులో ఆలస్యమవడంతో కుటుంబపోషణ, ఇంటి అద్దె, పిల్లల విద్య, వైద్య ఖర్చులు నిర్వహించడంలో ఇబ్బందులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను తెలియజేయడానికి ఆధ్యాపకుల బయోమెట్రిక్ హాజరు నమోదు, పరిపాలనా విధులను తాత్కాలికంగా నిలిపివేసి విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా తరగతిబోధన మాత్రమే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదలచేసి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనెలాఖరు వరకు సమస్య పరిష్కారం కాకపోతే ఏప్రిల్ 1నుంచి తరగతులు బహిష్కరించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు, టీచింగ్, నాన్‌టీచింగ్ అండ్ సబ్‌స్టాఫ్ సిబ్బంది, పిఆర్వో రఘు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా అగ్నిగుండాలు



అగ్నిగుండాలు దాటుతున్న దృశ్యం

**కొమురవెల్లి, మార్చి 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కొమురవెల్లిలోని మల్లికార్జునస్వామివారి అగ్నిగుండ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం వీరశైవ ఆగమోక్త ప్రకారం 108శివశంకరశివ పుణ్యాహవచనము, అఖండ దీపస్థాపన శివయాగ మంటపస్థాపన, రుత్విద్వరణం, శ్రీస్వామివారి పాదార్చన, శ్రీవీరభద్ర పల్లెరము, రాత్రి 9గంటలకు అగ్నిప్రతిష్ఠ, అగ్నిగుండప్రజ్వలన, అగ్నికార్యం నిర్వహించారు. సోమవారం ఉదయం గణపతి, గౌరీ స్థాపిత మండపారాధన, అనంతరం అష్టబలి, అగ్నిశాంతి, అశేషభక్తజనులమధ్య అగ్నిగుండందాటుట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మహాహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదవితరణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం, అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్, చైర్మన్ గంగం నర్సింహారెడ్డి, దర్మకర్తలు సార్ల లింగం, ఎ.మల్లేశం, ఎల్లయ్య, కొమురయ్య, వరలక్ష్మి నాగరాజు, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, సహాయ కార్యనిర్వహణాధికారులు బుద్ది శ్రీనివాస్, సుదర్శన్, అర్చకులు, ఆలయసిబ్బంది పాల్గొన్నారు.

## జ్ఞానేశ్వర్‌ను అభినందిస్తున్న డాక్టర్ ఓంప్రకాష్

**నాగల్‌గిద్ద, మార్చి 16, ప్రభాతవార్త:** మంజీరానదిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక సేవకర్త డాక్టర్ ఓంప్రకాష్ అన్నారు. ఎర్త్ లీడర్ పాలడుగు జ్ఞానేశ్వర్ నది పరిరక్షణకు చేపడుతున్న యాత్ర మంజీరానదీతీరానికి చేరుకోగా, డాక్టర్ ఓంప్రకాష్, జ్ఞానేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నదిలో వేయడంతో నదీజలాలు కలుషితం అవుతాయని, నది కలుషితం కాకుండా ప్రతి ఒక్కరు తమవంతు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు.

## కళ్యాణలక్ష్మి, గృహలక్ష్మి పథకాలు పూర్తిగా మర్చిపోయారు

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాశక్తి పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి మెమోరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవతరాలు కావస్తున్నా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కాకపోవడం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడమేనని, రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు చెల్లిస్తానని మాట ఇచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు ఆపథకాలు అమలుకాకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం తాము ఇస్తామన్న హామీలు వెంటనే నెరవేర్చాలని ఆయన రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అధికారులతో సమీక్షించిన ఎంపిడిఓ



మండలపరిషత్‌లో అధికారులతో సమావేశం అయిన ఎంపిడిఓ

**న్యాల్‌కల్, మార్చి 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల ఇంచార్జి అభివృద్ధి అధికారి నరేష్‌బాబు పంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఇంచార్జి ఎంపిడిఓ నరేష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లోని నర్సరీలు పచ్చగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవికాలంలో గ్రామాల్లోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో 100శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ సౌజన్య, ఉపాధిహామీ ఎపిఓ రంగారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాతృమూర్తిని పరామర్శించిన మాజీ మంత్రి

**పటాన్‌చెరు, మార్చి 16, ప్రభాతవార్త:** గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాతృమూర్తి గూడెం మాణెమ్మని సోమవారం రాష్ట్ర మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. భగవంతుడి ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. హరీష్‌రావుతోపాటు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే జిఎంఆర్, కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

## రంజాన్ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



రంజాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్‌చైర్మన్, అధికారులు

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణశివారులోని ఈద్గాను సోమవారం మున్సిపల్‌చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, నాయకులతో కలసి పరిశీలించారు. రంజాన్ రోజున వేలాదిమంది మైనార్టీలు సామూహికంగా ప్రార్థనలు చేసుకునేందుకు ఈద్గాకు వస్తారని, అందుకు భక్తులు ఎలాంటి అసౌకర్యంకలగకుండా ఏర్పాట్లు చేయాలని చైర్మన్ యూనుస్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆయావార్డుల కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా సంధ్యారాణి

**హుస్నాబాద్ రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:** హుస్నాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా న్యాయవాది సంధ్యారాణి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఆమెకు పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బార్ అసోసియేషన్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ న్యాయవాదుల సమస్యల పరిష్కారం, సంఘ అభివృద్ధికి కృషిచేయాలని ఆకాంక్షించారు. ఈ పదవిలో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని పలువురు అభినందనలు తెలియజేశారు.

## అత్యవసర సమయంలో మెరుగైన చికిత్స అందించాలి

### -ప్రోగ్రాం మేనేజర్ సంపత్



ఆకస్మికంగా అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ప్రోగ్రాం మేనేజర్ సంపత్

**కొండపాక, మార్చి 16, ప్రభాతవార్త:** అత్యవసర సమయంలో బాధితులకు అందించే ప్రాథమికచికిత్సలో ఎటువంటి తాత్సార్యం లేకుండా మెరుగైన వైద్యచికిత్స అందించాలని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సంపత్ అన్నారు. సోమవారం కొండపాక 108 అంబులెన్స్‌ను అయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా అంబులెన్స్‌లో ఉన్న పరికరాలు, మందులు బాధితులకు ఎటువంటి సమయంలో ఉపయోగిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలుసూచనలు, సలహాలను ఇచ్చారు. జిల్లాలోనే అత్యంత మెరుగైనసేవలందిస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలెట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్ల ముందస్తు అరెస్ట్




అంగన్‌వాడీ టీచర్లను పోలీసు ఠాణాకు తరలించిన దృశ్యం

**అల్లాదుర్గం, మార్చి 16, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చలో హైద్రాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లే అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లను, మధ్యాహ్నభోజన వంట కార్మికులను అల్లాదుర్గం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని పోలీసు ఠాణాకు తరలించారు. తమను అక్రమంగా అరెస్టుచేయడం తగదని, ఇది ప్రజాస్వామ్యం కాదని అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లు, మధ్యాహ్న భోజన వంటకార్మికులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా తమసమస్యలను పరిష్కరించుకునేందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే ఇక తమసమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. తమకు చేసిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని డిమాండ్‌చేశారు.

## ప్రమాదాల నివారణకు దారి మళ్లింపు



ప్రమాదాల నివారణకు వాహనాలను దారి మళ్లిస్తున్న ఎస్ఐ

**ఝరాసంగం, మార్చి 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కెవి పాఠశాల చౌరస్తాలో తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాలను దారిమళ్లిస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్ తెలిపారు. అటుగా వెళ్లే వాహనాలను క్రిష్ణాపూర్, బర్దీపూర్ గ్రామాలగుండా వాహనాల రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నామని, వాహన చోదకులు తమవంతు సహకరించాలని ఎస్ఐ క్రాంతికుమార్ సూచించారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తు

### -ఎస్ఐ వినయ్‌కుమార్



పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ వినయ్‌కుమార్

**జహీరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పట్టణ ఎస్ఐ కె.వినయ్‌కుమార్ అన్నారు. ఆదివారంరాత్రి పట్టణంలోని ఆదర్శనగర్ పార్కులో వాహ్ కిడ్స్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ కె.వినయ్‌కుమార్ మాట్లాడుతూ మొక్కై వంగనిది మ్రానై వంగునా అన్నట్లుగా విద్యార్థులు చిన్నతనం నుంచే కష్టపడి క్రమశిక్షణతో విద్యను అందుకోవాలని సూచించారు. పోషకులు తమ చిన్నారులను ఉన్నతులుగా ఎదిగేందుకు ఇప్పటినుంచే కృషిచేయాలని సూచించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆటలపోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ఈసందర్భంగా బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్, గుంజోటి సర్పంచి దేశెట్టిపాటిల్, పాఠశాల ప్రిన్సిపాల్ రమ్యసుధారెడ్డి, ఉపాధ్యాయులు, పోషకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి




సిపిఎం నాయకులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**బెజ్జంకి, మార్చి 16, ప్రభాతవార్త:** అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని కార్మికసంఘం హైదారాబాద్‌లో తలపెట్టిన శాంతియుత నిరసన కార్యక్రమానికి బెజ్జంకి మండలకేంద్రంలో సిపిఎం మండలశాఖ కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణను పోలీసులు ముందస్తుగా అరెస్టుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రసర్కార్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రూ.18వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసనకు బయలుదేరుతున్న అంగన్‌వాడీలను, యూనియన్, సిపిఎం పార్టీ నాయకులను అరెస్టుచేయడం సరికాదన్నారు. నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మార్చి 16, ప్రభాతవార్త:** పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విక్టరీ చౌరస్తాలోగల ఆయనవిగ్రహానికి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షులు కూర శ్రీనివాస్, కార్యదర్శి నాగమల్ల కిషన్, కోశాధికారి బుక్క అరుణ్, గంప కృష్ణ, చింత ప్రసాద్, చకిల రవికుమార్, పొశెట్టి ప్రసాద్, జైన సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ మృతి

### -సంతాపం వ్యక్తంచేసిన హరీష్, పార్టీ శ్రేణులు



టైగర్ నర్సమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

**సిద్దిపేట రూరల్, మార్చి 16, ప్రభాతవార్త:** సిద్దిపేట పట్టణ బిఆర్ఎస్ మహిళావిభాగం అధ్యక్షురాలు ఉద్యమకారిణి టైగర్ నర్సమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమెమృతి పట్ల మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు సంతాపంవ్యక్తంచేశారు. మొదటినుంచి కెసిఆర్ వెన్నంటే ఉన్న ఉద్యమకారిణి అని, కెసిఆర్‌కు ఎంతో ఆత్మీయురాలు అని ఆమెమృతి బాధాకరమని హరీష్‌రావు తెలిపారు. ఉద్యమ సమయంలో ఆమె పటిమను గుర్తించి స్వయంగా కెసిఆరే టైగర్ నర్సమ్మగా పేరు ఇచ్చారని గుర్తుచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కాగా పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, టైగర్ నర్సమ్మ మృతదేహానికి పార్టీ కండువాకప్పి పూలమాలలో నివాళులర్పించారు. అలాగే పార్టీనాయకులు రాజనర్సు, మేర సత్తయ్య, సయిద్, వేలేటి రాధాకృష్ణశర్మ, కోల రమేష్‌గౌడ్‌లు నివాళులర్పించారు.

## హిందూ దేవాలయ నిర్మాణానికి విరాళం అందజేసిన మైనార్టీ నాయకుడు



మాలపోచమ్మ ఆలయనిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మార్చి 16, ప్రభాతవార్త:** ఎన్నో సంవత్సరాలుగా ఆలయం లేకుండా ఉన్న గ్రామదేవత మాల పోచమ్మకు ఎట్టకేలకు గుడి నిర్మాణానికి పునాదిపడింది. కులమతాలకు అతీతంగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన మైనారిటీ సీనియర్ నాయకుడు మాల పోచమ్మ గుడి నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.40వేల విరాళాన్ని అందజేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. సదాశివపేట మండలం ఎంకేపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచి దుర్గాప్రసాద్ హాజరైనారు. కార్యక్రమంలో మైనార్టీ వార్డు మెంబర్లు అప్సర్ భాష, జాకీర్, సిహెచ్ రామచందర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు అంబరీష్, ప్రకాష్, శ్రీనివాస్, నర్సింలు, జగదీశ్వర్, చంద్రయ్య, మహేందర్, సూర్యప్రకాష్, సువర్ణ, సుమలత, లక్ష్మణ్, బాలమణి, నిర్మల, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ముగిసిన హజ్రత్ సూఫీ షా ఆరాధన



దర్గాకు గంధంను ఊరేగింపుగా తీసుకుపోతున్న దృశ్యం

**చౌటకూరు, మార్చి 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చౌటకూరులోని హజ్రత్ సూఫీ షా మహమ్మద్ హుస్సేన్ ఉర్స్ ఆబిద్ అలీ షా షుత్తారియల్ ఖాద్రీ 13వ ఆరాధన సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం వరకు గుస్ల్ షరీఫ్, హల్వా షరీఫ్, ఖవ్వాలి, గంధం షరీఫ్, ఫాతేహా ఖానీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలు ముగిసాక దర్గా పీఠాధిపతి అహ్మద్ పాషా గంధం ఊరేగింపు నిర్వహించారు. ఉర్సు ఉత్సవాలకు నిర్మల్, అన్నాసాగర్, రాయిపల్లి పీఠాధిపతులు ముహమ్మద్ జాకిర్ హుస్సేన్, ముహమ్మద్ ఖలీల్ హుస్సేన్, అక్రం అలీలు హాజరై, హజ్రత్ సూఫీ షా దర్గాను దర్శించుకున్నారు. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్దసంఖ్య దర్గాను దర్శించుకున్నారు.

# ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

## -రెవెన్యూ డివిజన్ సాధించి తీరుతాం
## -జెఎసి చైర్మన్ డాక్టర్ పరమేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పరమేశ్వర్

**చేర్యాల, మార్చి 16, ప్రభాతవార్త:** చేర్యాల రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని ఊరూరా ఉధృతం చేయడానికి కమిటీలు ప్రకటిస్తున్నామని జెఎసి చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ తెలిపారు. సోమవారం జెఎసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కమిటీలను ప్రకటించారు. రాజకీయ వ్యవహారాల సంప్రతింపుల కమిటీ సమన్వయకర్తలుగా అందె బీరయ్య ఫార్వర్డ్ బ్లాక్, అందె అశోక్ సిపిఐ, బస్వగళ్ల సిద్దయ్య, బిఎస్పీ కులసంఘాలు, ప్రజాసంఘాల సమన్వయకర్తలుగా బుట్టి సత్యనారాయణ మాల మహానాడు, గడిపే బాలనర్సయ్య ఎమ్మార్పీఎస్, అంబాల రాము గౌడసంఘం, రిటైర్డ్ ఉపాధ్యాయ ఉద్యోగసంఘాలసమన్వయకర్తలుగా పిల్లి చంద్రం, పోలోజు వెంకటాద్రి, కరెడ్ల రాజిరెడ్డి, ఎక్కలదేవి సుధాకర్, రైతుసంఘాల సమన్వయకర్తలుగా ఈరి భూమయ్య, కత్తుల భాస్కర్‌రెడ్డి, నంగి కనకయ్య, పిల్లి రవి, విద్యార్థి, యువజనసంఘాల సమన్వయకర్తలుగా రామగళ్ల నరేష్, చందా శ్రీకాంత్ ప్రైవేట్ విద్యాసంస్థల సమన్వయకర్తలుగా తౌట రామాంజనేయులు, ఎండి అక్బర్, దేవేందర్ రెడ్డి మహిళాసంఘాల సమన్వయకర్తలుగా పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, లైట్ మోటార్ యూనియన్ పచ్చిమడ్ల మహేందర్, పాక బాలయ్య, ఆర్‌ఎంపిల సమన్వయకర్తలుగా నరసింహారెడ్డి, రమేష్ మద్దూరు, కనకయ్య వీరన్నపేట, కనకయ్య కడవేరుగు, క్రైస్తవ అసోసియేషన్ సమన్వయకర్తలుగా తెట్టె బావి డేవిడ్, మోజెస్, ఎర్రగుంట్ల ప్రభాకర్‌లను ఎన్నికచేశారు. అలాగే త్వరలో మండలకమిటీలు ప్రకటించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ జెఎసి నేతలు అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, గడిపే బాలనర్సయ్య, పోలోజు వెంకటాద్రి, ఆత్మకూరి హరిక్రిష్ణ తదితరులున్నారు.